# పానశాల



కవికోకిల

దువ్వూరి రామిరెడ్డి

*Collector's Edition*

# Pānasāla

by
Kavikokila Duvvuri Ramireddy

© ***arts & letters***

Publication No : **14**
First Edition : **November, 2017**
Copies : **2000**
Price : **₹ 299/-**

**ISBN : 978-81-927679-8-7**

*Illustrations :*
**Sivaji Tallavajjhala**

*Musical rendering :*
**Gummadi Gopalakrishna**

*Designing :*
**Mohd. Khurram Uddin Zeeshan**

*Published by :*
***arts & letters***
Indirapark Cross Roads,
Domalaguda,
Hyderabad - 500029
Ph: 040-27635654

*For Copies :*
***arts & letters***
**Visalaandhra Publishing House**
**Nava Chethana Publishing House**
**Navodaya Book Shop**
**Telugu Book Shop**

*Printed at :*
**Kalajyothi Process Pvt. Ltd**
Hyderabad - 500 020
Ph: 040-27645536

# పానశాల

లెమ్మోయీ మదిరాతపస్వి, దిశ లాలేఖ్యంబు[1]గామాఱెఁ; బా
త్రమ్మున్నింపుము గోస్తనీరసము[2]నన్ రాగోదయశ్రీలు పైఁ
గ్రమ్మన్ జీవితభాజనంబు పరిపూర్ణంబౌటకున్మున్నె; కా
లమ్మౌనన్న రవంబువింటి మధుశాలన్ మొన్న లేఁబ్రొద్దునన్.

అరుణుఁడు యామినీవిభవమంతయుగెల్చి జయాంకమట్లు క
ర్బుర[3] రమణీయ కేతనముఁ బూర్వదిశం బయికెత్తె లెమ్ము; ని
ద్దురవిడి తమ్మిపూవులటు తొంగలి[4]ఱెప్పలనెత్తిచూడు; నీ
వెఱుఁగవొ తొయ్యలీ[5], చిరము నియ్యలఁగన్నులుమూయ కట్టడన్.

పారదమట్లు జీవితము పట్టిననిల్వదు; శీఘ్రగామి; ద్రా
క్షారసమిమ్ము, తాపమునఁగందెను జిత్తము; జాగరూక సం
చారము నిద్రదౌలతు[6] వశంబయి రూపఱు[7]; యౌవనంపుటం
గారము నీటఁజల్లవడుఁ; గన్నులనెత్తుము, లెమ్ము నెచ్చెలీ.

*1. చిత్తరువు; 2. ద్రాక్షరసం; 3. చిత్రవర్ణం; 4. వాలిన; 5. స్త్రీ; 6. సంపద; 7. నశించిపోవు.*

ఎఱుఁగవె కాలవల్లి మనయిద్దఱి మృత్యువు లల్లుఁగొయ్యగాఁ
బెరుగు; గుడారమౌను మనవేడ్కకు నీభువనంబు, జంటగాఁ
గరముల వారుణీభరిత[1] కాంచనపాత్రిక లందికొన్న న
ద్దిర! మనచేతఁ జిక్కువడదే చిరకాలపుసత్య మంగనా!

చెలులను బంధులన్ మధురశీధువు[2] నామనితోఁట[3] వీడి యూ
హలు నెగఁద్రాకఁ జాలని రహస్యపుఁ జోటికిం బోదువీవు; నేఁ
బలికెదఁదెల్పరాని యొకభావము; సంధ్యలఁ దూలి రాలు పూ
వులు కృశియించుఁగాని విరఁబూయవుక్రమ్మఱ; నమ్ముమో సఖీ.

కాలమహర్నిశంబనెడు కత్తెరతో భవ దాయురంబర
శ్రీలహరించు; మోముపయిఁజిల్కును దుమ్ముదుమార; మేలొకో
జాలిపడంగ? నీక్షణము సంతసమందుము; నీవువోదు; వీ
రేలుఁ బవళ్ళు మున్నటు చరించు నిరంతర మండలాకృతిన్.

---

*1. మద్యం నిండిన; 2. తీయని మధువు; 3. వసంతోద్యానం.*

ఈ మధుమాసశర్వరు[1]ల నిందుశిలా[2] రమణీయవేదిఁ గాం
తామణిఁ గూడి రాగవతినా వహియింపుము పానపాత్ర నా
రామమునందు; నీ వెఱుఁగరాక లయింతు[3]; వనాదికాల హిం
సా మలిన ప్రవృత్తి మధుసారమునం గడుగంగఁ జెల్లదే?

జిలిబిలి కమ్మగప్పురపుఁ జిన్నెల వెన్నెలగుత్తి తావులం
జిలుకుచుఁ జైత్రయామవతి[4] చీరచెఱంగునఁ బూతఁపూచె; నె
చ్చెలి, యిటువంటికాలమిఁకఁ జిక్కదు; భోగ్యముమద్య; మెన్ని ల
క్షల సమలీ[5] నిశాప్రియుఁడు కాంతిలునో మన గోరిమిట్టలన్.

జీవితసార్ధవాహము[6] విచిత్రగతిం బయనించు, నందులో
నీ వొకఱెప్పపాటయిన నెయ్యురతో[7] సుఖముందువేని మో
దావహ మంతకన్నఁ గలదా? మధుపాత్రిక నందియిమ్ము సా
ఖీ, వివరించెదేల తిలకింపని రేపును? రేయి జాఱెడిన్.

*1. రాత్రులు; 2. చంద్రకాంతశిల; 3. నశించు; 4. చైత్రమాసపు రాత్రి; 5. సంవత్సరాలు; 6. యాత్రికుల / వర్తకుల సమూహం; 7. మిత్రులతో.*

తలఁపన్ లౌకిక కార్యకల్పనల గంతవ్యంబు శూన్యత్వ; మీ
వు లయంబొందినయట్లెయౌదు; వసువుల్ వోనాటకున్మున్నె[1] మం
జుల వల్లీనిలయంబులం[2] జెలుల మోజుల్దీర్చి ఖయ్యామ; త
ల్లలనామండల భుక్త శేష రసమున్ ధన్యుండవై గ్రోలుమా.

వాదులుమాని నాసరస వారుణినానుము, దానితో మహా
మ్మోదు సమస్తరాజ్యరమ పోలదు! వేణువినోదగీతి దా
వీదు గళస్వనంబటుల విశ్వరసోదయ హేతువయ్యె శా
తోదరి[3], నేఁటి సమ్మదము నోడకు రేపను జూదపాటలోన్.

కను మెపుడో యకాండముగఁ[4] గాలము నీపయి దొమ్మిపోటు[5] సే
యనియపుడే గులాబిజిగులారెడు ద్రాక్షరసంబు నానుమా;
తనువు నశించి దుమ్మగుట తథ్యము, నీవు పసిండిముద్దవా
జను లొకసారి పూడ్చి మఱుసారి నినుం బెకలించి యెత్తఁగన్.

*1. ప్రాణాలు పోకముందే; 2. లతాగృహాలలో; 3. సన్నని నడుము కలిగిన స్త్రీ; 4. అకస్మాత్తుగా; 5. ఒక్కసారిగా మీదపడి పోవడం.*

వనిత, యనుంగు ముంగురులపైఁ జెయివైచితి నంచు నూరకే
కనలెదవేమొ; నాయెడఁద కట్టువడెన్ నెలవంకయుచ్చులం;
జెనఁటి[1] తమాషకై యురులఁ[2] జేయిడ; నాహృదయంబునేనెకో
రినయటు బుజ్జగింప బెదరించెదవేల తుటారి[3] చూపులన్.

అమృతరసాయనోష్ఠి[4], స్ఫటికాసవపాత్రము నాకుమాఱు నీ
సుమరదనచ్ఛదంబున[5] నసూయరగుల్కొన ముద్దువెట్టెఁ; బం
తముమెయి దాని నెత్తురును ద్రావకయుండిన నన్ను ఉగ్రమఖ
య్యమయని పిల్వఁబోకు, తగవౌనె పరాంగన మోవిముట్టఁగన్.

చెలియ, మనోహరప్రణయ శీతలతన్ సుఖియించు నామనం
బలమటతోఁ[6] దపించు నకటా! భవదీయ వియోగకీలలన్;
దెలియదొ, సాఖియార్తులకుఁ దియ్యని మందని; ప్రాణముల్ త్వదం
ఘ్రుల విడిపింతు; రమ్ము, బ్రదుకున్ నిలబట్టెద నిట్టియాసలన్.

*1. భాగ్యహీనుడు; 2. ఉచ్చులు; 3. తుంటరి; 4. అమృత రసాయనం వంటి పెదవులు కలదానా; 5. పూవువంటి పెదవిపై; 6. బాధ.*

అఖిల శాస్త్ర పురాణ తత్త్వాబ్ధి లీఁది
పరమ విజ్ఞానదీపమౌ పండితుండు
కాళరాత్రిని మార్గంబు గానలేక
యల్ల మామూలుకథఁ జెప్పి యంతరించు!

జీవితంబెల్ల బహుశాస్త్ర సేవలందుఁ
గడపితి, రహస్యములు చాల గ్రాహ్యమయ్యె;
నిప్పుడు వివేకనేత్రంబు విప్పిచూడ
దెలిసికొంటి నాకేమియుఁ దెలియదంచు.

మనకు ముందేఁగినట్టి యా మాన్యులెల్లఁ
బ్రబలగర్వాంధ నిద్రానిబద్ధులైరి;
నెలఁత, మధు వాని నావల్ల నిజము వినుము;
వారు చెప్పిన చదువెల్ల వట్టి కల్ల!

లలనరో, మున్ను నస్థితిజలంబున[1] "నే"ననువిత్తునాటి, య
వ్వలఁ బరివేదనాగ్నిశిఖఁ[2] బ్రాణము వోసెను; గాలిపోల్కిని
య్యిలసకలంబుఁ గ్రుమ్మరుదు[3]; నెచ్చటి మృత్తికతోడఁజేసెఁగ్రం
తల[4] కిరవైన యీతనువుఁ? దాఁకినఁ దప్పిన మన్ను దుమ్మగున్.

ఇలకు రాకపోకల నాకు స్వేచ్ఛయున్న
రాకయుందును; వచ్చినఁ బోకయుందు;
వీలుపడునేని యీపాడునేలయందు
ఉనికి పుట్టువు చావు లేకున్న మేలు.

అయయో! మూలధనంబు హస్తగళితంబౌ చుండె నానాఁటికిన్;
వ్యయమైపోయిరి మానవుల్ మరణశయ్యాసుప్తులై; తన్మృతా
లయ వృత్తాంత మెఱుంగ గోరి వయసెల్లన్ వేచుటేకాని[5] యా
రయ లేనైతి దివంబునుం డిటకు యాత్రల్సేయు దేశాటులల్.

*1. అస్థితి అనే నీటిలో; 2. దుఃఖమనే అగ్నిశిఖ; 3. సంచరించు; 4. రంధ్రాలు; 5. ఎదురు చూడడం.*

తెఱవ కడాని[1] ఱొమ్మొఱగుదిండున మే నరమోపి పూవుఁజ
ప్పరములఁ[2] గూరుచుండి మధుపాన వినోద విపంచికా రవ
స్ఫురిత ముదాత్ములైననె రుచుల్ వచియింపఁగవచ్చుఁగాని, నే
ర్చిరె యలరెంటికిం జెడిన రేవళు లందు మజా నెఱుంగఁగన్.

కనుఁగొను; శబ్ద రూప రస గంధములన్ సుఖమైనస్పర్శ మో
హనమగు నీ ప్రపంచము ననంతముగా సృజియించి ధాత చే
సెనె శిలతోడ మానవుని చిత్తము? సద్ధృదయంబులేనిచో
జనులఁ బరస్పర ప్రణయ సఖ్యము మందునకైనఁజిక్కునే?

కలపయు మట్టి ఱాల నిడి కట్టిన దేవళమందు నీకు నే
ఫలము లభించు? ప్రేమరస భావయుతుండవయేని కామినిన్
వలవుము; ప్రాణహీనమగు బండలు వేయిటికన్న శ్రేష్ఠమై
యలరుఁగదా మనుష్య హృదయంబు ప్రతి ప్రణయానురక్తులన్.

*1. మేలిమి బంగారం; 2. పూల మంటపాలలో.*

సలలితగోస్తనీఫలరసంబును గ్రోలెడువారు, దేవళం
బుల నిశియెల్లఁ బ్రార్థనలఁ బుచ్చెడువారు; జలప్రవాహావీ
చులఁబడి మున్గినారు; పొడిచోటి కొకండును జేరఁ; డొక్కఁడే
యలరుఁ బ్రబుద్ధుఁడై, మిగతయందఱు మత్తులు పెద్దనిద్దురన్.

మితిసెడ[1], సృష్టివేళఁ దనుమృత్తిక[2] నెవ్వఁడు మేళవించె; జీ
విత సిచయంబునం[3] బడుగుపేకల నున్నియుఁ బట్టు గల్పె; దు
ష్కృతులను బుణ్యకార్యములఁజేయఁ లిఖించెను నొష్ట[4], వాఁడె మ
త్కృతులకు మూలకారణము, కీడును మేలును వాని సేఁతలే.

పాపముఁ జేసితంచుఁ దలఁపం బనియేమి ఖయామ? దుఃఖ సం
తాపము నిష్ఫలంబగు; వృథా వగపిల్లుట మాను; మెవ్వరుం
బాపము సేయకున్నఁ దన మన్నన యెందుకు? కల్మషాత్ములన్
“రేపు” క్షమించుఁ; బాపము హరించును దైవము; సంతసింపుమా.

---

*1. కొలత చెడిపోవునట్లు; 2. శరీరపు మట్టి; 3. వస్త్రం; 4. నొసట.*

అలరె విమర్శనంబు! కననయ్యె వివేకము; సర్వశాస్త్రముల్
దెలిసిన పండితోత్తములనే నిఱుపేదలఁ జేసినాఁడ; వం
జలిని బ్రసాదమై పిడుగు జాఱును భక్తుల[1]; కింతయేల? దు
ష్టులకు సుఖంబు సంపదలు చొప్పడు[2]; నింపగునీకుఁ బాపముల్.

నెలఁతా, దేవునికట్లు నాకును జగన్నిర్మాణమర్మక్రియల్
గలవేన్, దుర్విషమప్రచారి[3]యగు లోకంబున్ యథేచ్ఛామతిం
జెలువంబౌనటు[4] సంస్కరించి నవసృష్టింగూర్తు సన్మార్గవ
ర్తులు ప్రాజ్ఞుల్ భువి సర్వసంపదల సంతోషంబుగన్ వర్ధిలన్.

ఈ విషవృక్షలోకమును నింకొకరీతిఁ బునః సృజింపుమం
చే వినతిన్, వచింతు; నది యిష్టమయేని రచించు చెచ్చెరన్;
దేవ, మదీయ నామమును దెప్పుఁన బట్టికఁ[5] గొట్టివేతువో,
నావయసున్ శతాధిక మనన్ సవరింతువొ చూడఁగావలెన్.

*1. భక్తుల దోసిట్లో ప్రసాదంగా పిడుగుపడుతుంది; 2. లభిస్తాయి; 3. ఎక్కువ తక్కువలతో నిండివున్న; 4. అందంగా; 5. అతిశయంతో పట్టికలోనుండి.*

విషము నమృతంపు మసిబుడ్ల విధి కలంబు
ముంచి లోకుల నుదుట లిఖించు మొదటఁ;
గరఁగ దఱుఁబేద[1] కన్నీటి కాల్వనదియుఁ,
బరమభక్తుని యనుతాప వహ్నిఁజెడదు.

కాన నెది ప్రాప్తమైనను గారవించు,
వలయు వలదని యేర్పఱుపంగ లేవు;
అంబరంబును నీకు సహాయపడదు,
తానె తలక్రిందుగా వ్రేలుఁ; దడవు నిలదు[2].

ఇల చదరంగ; మందు జనులెల్లరు పావు; లహస్సులుఁ[3] నిశల్
దెలుపును నల్పుగళ్లు; కదలించును రాజును బంటుఁ దక్కు పా
వుల[4] విధియాటకాఁడు; పలుపోకలఁ[5] ద్రిప్పును గళ్ళ మార్చు, న
వ్వల నొకటొక్కటిం జదిపివైచు[6] నగాధ సమాధి పేటికఁ.

*1. అతిపేదవాడి; 2. నిలవదు; 3. పగళ్ళు; 4. తక్కిన పావులను; 5. అనేకవిధాలుగా; 6. నలిపివేస్తాడు.*

ఎందుకుఁజూచి నన్ గొనకయేఁగెదు? చక్కని గిండి[1]గానొ, న
న్నందఱు వ్రేలుచూపి పరిహాసముచేయుదు; రైపు[2] నాది గా
దిందుఁ, గులాలశిల్పి[3] నను నిట్లొనరించె; రచించు నప్పుడుం
దందరలాడె[4] నేమొ చెయి త్రావుడుమత్తున, నొక్కె సొట్టగన్.

ఓరీకుమ్మరి, పిల్పువచ్చె; వినుమాయొక్కింత నాకోర్కె; నా
గోరీమృత్తికఁ బానపాత్ర లిటికల్ కూజాలు జాడీలు సొం
పారం దీరిచి యమ్మవోయి మదిరాపణ్యంబులన్; గోస్త నీ
సారస్పర్శఁ బునఃప్రబోధితుఁడనై[5] సత్యంబుఁ జాటించెదన్.

కడుగుఁడు నాశవంబుఁ దడిగా మధుధారల; ద్రాక్షపుల్లలుం
బుడకలు పెట్టెయల్లి ననుబూడిచి పెట్టుఁడు శీధుబిందులన్[6]
వడిసెడి[7] నాదుమృత్తికల వాసన గుర్తగుమీకు; "రేపు" నన్
బడయుదు రాసవాలయము[8] వాకిటనో, చెలి కాలిధూళినో!

---

*1. కమండలం, చెంబువంటి పాత్ర; 2. జాడ; 3. కుమ్మరిశిల్పి; 4. కలతపడు; 5. ద్రాక్షసారాయి స్పర్శతో మళ్ళీ మేలుకున్నవాడినై; 6. సారాయి బిందువులు; 7. కార్చే; 8. మధుశాల.*

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Panasala**

* * *